

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా చాలా మంది వాహనదారులు కేవలం హెల్మెట్ ధరించని కారణంగానే మరణిస్తున్నారన్నారు. నాణ్యత కలిగిన హెల్మెట్ ధరిస్తే ప్రమాదానికి గురైనప్పటికీ స్వల్ప గాయాలతో ప్రాణాలు రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై ఎంవీ నిబంధనల ప్రకారం ఈ-చలానా విధిస్తామని హెచ్చరించారు.

రీ సర్వేతో ఇన్ని కష్టాలా?



కొత్తవలస: ఉమ్మడి ఎల్‌పీఎంతో ఉన్న భూములు

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వే రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది. అప్పటి నుంచి అవస్థలు పడుతూనే ఉన్నారు. నాటి ప్రభుత్వం జాయింట్ ఎల్‌పీఎంను జారీ చేయడంతో రైతుల మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. అవి నేటికీ పరిష్కారం కాలేదు. మరోవైపు కష్టకాలంలో భూమిని అమ్ముకోలేక వారు నరకయాతన పడుతున్నారు. పెరిగిన చలానా ఫీజుతో జాయింట్ ఎల్‌పీఎంను విడదీయడానికి ఆర్థిక ఇబ్బందులూ తప్పడం లేదు.

- రైతులను వెంటాడుతున్న భూ సమస్యలు
- గత ప్రభుత్వం చేసిన తప్పులకు ఇప్పటికీ ఇబ్బందులు
- జాయింట్ ఎల్‌పీఎంను విడదీయాలంటే ప్రహసనమే
- మళ్లీ సర్వే చేయించుకోవాల్సిందే
- ఈ నెల నుంచి పెరిగిన చలానా ఫీజు

కొత్తవలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి)

రీసర్వే చిక్కుల నుంచి రైతులు బయట పడలేకపోతున్నారు. సుమారు వంద సంవత్సరాల తరువాత తామే భూములను రీసర్వే చేసి రైతులకు భూ సమస్యలు లేకుండా చేస్తామని అప్పట్లో వైసీపీ ప్రభుత్వ నేతలు చెప్పి రీసర్వే చేయించారు. ఆ తరువాత రైతుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. సర్వే నంబర్ల నమోదు ప్రక్రియ ఓ పద్ధతిలో జరగలేదు. ఒక రైతు పేరిట ఉన్న సర్వేనెంబరును పక్కనే ఉన్న ఇద్దరి ముగ్గురి రైతుల సర్వేనెంబర్లతో కలిపి ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) పేరుతో ఒకే సర్వేనెంబరు ఇచ్చారు. దీంతో రైతులకు మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన వారినే కాకుండా ఇతరులతో కలిపి జాయింట్ ఎల్‌పీఎంలు ఇచ్చారు. దీనివల్ల ఒక సర్వేనెంబరులోని భూమిని విక్రయించుకోవాలన్నా ఎల్‌పీఎంలో ఉన్న భూమంతా రిజిస్ట్రేషన్ చేయాలంటున్నారు. లేకుంటే మళ్లీ సర్వే చేయించుకుని అమ్మదలచిన భూమికి కొత్త ఎల్‌పీఎం చేయించుకోవాలి. అంతే కాకుండా ఒక సర్వేనెంబరులో ఎకరం భూమి ఉంటే అందులో అర ఎకరం విక్రయించుకోవాలన్నా సాధ్యం కాదు. ఎకరం భూమిని సర్వే చేసుకుని తొలుత రెండు ఎల్‌పీఎంలుగా మార్చుకోవాలి. రీ సర్వే తర్వాత రైతులకు ఇన్ని చిక్కులు వచ్చి పడ్డాయి.

2024 ఎన్నికలు సమీపిస్తుండడంతో రీ సర్వే (మిగతా 8వ పేజీలో..)

చలానా చెల్లిస్తే వచ్చి సర్వే చేస్తారు..



భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎంలను విడదీసుకోవడానికి జూలై 1వ తేదీ నుంచి ఫీజు పెరిగింది. ఒక్కో సర్వే నంబర్‌కు రూ.550 చొప్పున చెల్లించాలి. ఆ తర్వాత గ్రామానికి సర్వేయర్, వీఆర్వో వచ్చి పరిశీలించి కొత్త ఎల్‌పీఎం ఇస్తారు. అలాగే 1-బీ కాపీలో అనువంశికానికి బదులు క్రయం అని మార్పు చేసుకోవాలంటే దస్తావేజులతో పాటు సర్వేనెంబరుకు రూ.50 చొప్పున చలానా చెల్లించాలి.

-అప్పలరాజు, కొత్తవలస తహసీల్దార్

నిధులు సరే.. బిల్లులేవి?

- జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగ పనుల బకాయిలు రూ.109 కోట్లు
- 20 శాతం నిధులే విడుదల ?
- నిరాశ చెందుతున్న కాంట్రాక్టర్లు
- గ్రామాల్లో మధ్యలో నిలిచిపోయిన రోడ్లు






విజయనగరం కలెక్టరేట్, జూలై 6(ఆంధ్రజ్యోతి):

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి(పంచాయతీ వర్క్‌లు) గంట్యాడ మండలంలో గత నెల 23న రూ.2.41 కోట్లకు ఎఫ్‌టీవో(ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లు అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకూ పనులు చేసిన వారికి బిల్లులు బ్యాంకు ఖాతాలకు జమ కాలేదు. అలాగే పశువుల షెడ్ల విషయానికి వస్తే కోటి రూపాయలకు గత నెల 17,18 తేదీల్లో ఎఫ్‌టివోలు జనరేట్ చేయగా ఇప్పటివరకూ రూ.35 లక్షలు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్లు నిరాశ చెందుతున్నారు. ఈ సమస్య జిల్లా వ్యాప్తంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.109 కోట్ల బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 13 నుంచి ఇదే పరిస్థితి ఉంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్లు, సోప్ పిట్స్ వంటి (మిగతా 8వ పేజీలో..)

రావివలసలో బిల్లు అందని పశువుల షెడ్డు

బుడా లేఅవుట్ ఎప్పటికో!



డొంగురువలస సమీపంలో గుర్తించిన భూమి

- బొబ్బిలి ప్రజల సొంత ఇంటి కల నెరవేరేదెప్పుడో!
- ప్రైవేట్ స్థలాల సేకరణకు అవకాశం ఉన్నా..
- ఆ వైపుగా నేతలు, అధికారుల్లో కానరాని చొరవ

బొబ్బిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఆధ్వర్యంలో మధ్యతరగతి ఆదాయ వర్గాల వారికి (ఎంఐజీ) లేఅవుట్ ద్వారా ఇళ్ల స్థలాల విక్రయానికి చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రావడం లేదు. సుమారు మూడు నాలుగేళ్ల కాలం గడుస్తున్నప్పటికీ ఇంతవరకు భూసేకరణ ప్ర క్రియ పూర్తి కాలేదు. స్థానిక గ్రోత్‌సెంటరులో తొలుత భూములను గుర్తించినప్పటికీ 50 ఎకరాల భూమికి సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస సమీపంలో గతంలో ఇళ్ల కాలనీల కోసం గుర్తించిన భూమిని ఎంపిక చేశారు. కానీ కోర్టు కేసు వల్ల సేకరించలేదు. డొంగురువలస గ్రామ సమీపంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ భూమి కూడా కోర్టు కేసు వల్ల ఆగిపోయింది. తాజాగా ఇంకో దగ్గర భూసేకరణ కోసం కసరత్తు ప్రారంభించారు. డొంగురువలస సమీపంలోనే మరో 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని ఎంఐజీ కోసం ప్రతిపాదించాలని బుడా భావించింది. అక్కడ 20 ఎకరాలు ప్రభుత్వానిదేనని కోర్టు నిర్ధారించడంతో ఎవరికీ పరిహారం చెల్లించాల్సినవసరం లేదని అధికారులు నిర్ణయానికి వచ్చారు. అయితే భూయజమానులుగా చెప్పుకుంటున్న వారు మరో (మిగతా 8వ పేజీలో..)

ఎంఐజీ లేఅవుట్లు వేస్తాం

బొబ్బిలి, పార్వతీపురం పట్టణాల్లో ఎంఐజీ లే అవుట్ల ఏర్పాటు కోసం స్థల సేకరణ ప్రక్రియ జరుగుతోంది. ప్రభుత్వ స్థలాలేవీ అందుబాటులో లేని పక్షంలో ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసి మధ్యతరగతి వర్గాల వారికి కేటాయిస్తాం. సాలూరులో వేసిన ఎంఐజీ లేఅవుట్ విజయవంతమైంది. అక్కడ మూడు విడతలుగా స్థలాలను లాటరీద్వారా కేటాయించాం. ఇదే పద్ధతిలో బొబ్బిలి, పార్వతీపురంలో కూడా లేఅవుట్లు వేసేందుకు కృషి జరుగుతోంది.

- తెంటు లక్ష్మునాయుడు, బుడా చైర్మన్, బొబ్బిలి



లేఅవుట్ కోసం భూములను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

తోటపల్లిలో తొలి ఏకాదశి పూజలు

గరుగుబిల్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా పేరొందిన తోటపల్లి ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా నమో నారాయణ నామస్మరణ మార్మోగింది. వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాలకు భక్తులు పోటెత్తారు. ఉభయ ఆలయాల్లో స్వామివార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు వీవీ అప్పలచార్యుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ విశేష కల్యాణోత్సవాలను తిలకించి పరవశించిపోయారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. అన్నసమారాధన, ఉచిత ప్రసాదాలు అందించారు. ప్రముఖ దేవాలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. రామమందిరాలు, వేంకటేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఏకాదశి పూజలు నిర్వహించారు.

‘తోటపల్లి’ నుంచి సాగునీరు విడుదల

- శివారు భూములకూ సాగునీరిందిస్తాం: మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం/గరుగుబిల్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు నుంచి ఆదివారం సాగునీరు విడుదల చేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ప్రాంతంలో నాగావళి నదికి జలహారతి ఇచ్చిన అనంతరం మంత్రి సంధ్యారాణి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివారు భూముల వరకు తోటపల్లి నీరు అందిస్తామని చెప్పారు. అన్నదాతలకు ఏ కష్టం రానివ్వబోమన్నారు. వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో కుడి ప్రధాన కాలువ నుంచి 1,31,221 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువల నుంచి 64 వేల ఎకరాలకు నీరు సరఫరా చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోందని, గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీఎంఎఫ్ గ్రాంట్ కింద కుడి ప్రధాన కాలువలో జంగిల్ క్లియరెన్స్ పూడిక తీత పనులు చేపట్టిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరమైన పనులు చేపట్టేందుకు సుమారు రూ. 67 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. అంతకముందు ఎన్టీఆర్, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



తోటపల్లి నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, (ఇన్‌సెట్)లో కాలువలోకి నీటి పరవళ్లు

7లో


అర్హులందరికీ ఇళ్ల స్థలాలు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మీరు విమర్శించండి.. మేము అభివృద్ధి చేస్తాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి
- పశు సంవర్ధకశాఖ జేడీ వైవీ రమణ

వారంతా బడి బయటే

- 2,637 మంది డ్రాపౌట్స్
- సమగ్ర శిక్ష సర్వేలో తేలిన వైనం
- వారందరినీ బడిలో చేర్పించే పనిలో అధికారులు



- రాజాం నియోజకవర్గంలో సమగ్ర శిక్ష విభాగం ఇటీవల చేసిన సర్వేలో 227 మంది డ్రాపౌట్స్‌ను అధికారులు గుర్తించారు. ఒకటి నుంచి 10వ తరగతి మధ్య వీరంతా వివిధ కారణాలతో చదువు ఆపేశారు. ఇందులో కొందరు వ్యవసాయ పనులు, మరికొందరు చిన్నచిన్న దుకాణాల్లో పనిచేస్తున్నట్టు గుర్తించారు. వారి వయసును బట్టి అధికారులు చదువుకు అవకాశం కల్పించనున్నారు.

రాజాం, జూలై 6(ఆంధ్రజ్యోతి):

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు కలిపి 2,637 మంది పిల్లలు బడి బయట ఉన్నట్టు అధికారులు గుర్తించారు. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో చేసిన సర్వేలో ఈ విషయం తేలింది. తల్లిదండ్రులు వలస వెళ్లడం, ఎక్కువకాలం సెలవుల్లో ఉండడం, చదువు పట్ల ఆసక్తిలేకపోవడం తదితర కారణాలతో ఎక్కువ మంది బాలలు పాఠశాలకు దూరమైనట్టు స్పష్టమవుతోంది. అయితే నగరప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉన్న విజయనగరం నియోజకవర్గంలో ఏకంగా 839 మంది పిల్లలు పాఠశాలకు దూరంగా ఉన్నట్టు తెలియడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని 27 మండలాల్లో ఓ ఆరు మండలాల్లో మాత్రం వంద మందికిపైగా డ్రాపౌట్స్ ఉన్నారు. అయితే ఈ ఏడాది ముందస్తుగానే అధికార యంత్రాంగం మేల్కొంది. పూర్వ ప్రాథమిక విద్యకోసం అంగన్‌వాడీలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ ఉద్యోగులు, వలసలు వెళ్లే పిల్లల కోసం కేజీబీవీ సిబ్బంది రంగంలోకి దిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ 2,637 మందిని సైతం వారి స్థాయిని బట్టి పాఠశాలల్లో చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. పదో తరగతి (మిగతా 8వ పేజీలో..)

దృష్టి పెట్టాం

జిల్లాలో డ్రాపౌట్స్‌పై దృష్టిపెట్టాం. జూన్ లోనే బడికిపోతాం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా ఇంకా బడికి దూరంగా 2,637 మంది ఉన్నారు. వారందర్నీ గుర్తించి సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. వీలైనంత వరకూ పాఠశాలల్లో చేర్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- ఎ.రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ, విజయనగరం

రోడ్డెక్కిన మహిళలు

- తాగునీటి కోసం ధర్నా
- రాజాం-బొబ్బిలి రోడ్డులో ఆందోళన
- నాలుగు గంటల పాటు నిలిచిపోయిన ట్రాఫిక్
- మున్సిపాలిటీ తీరుపై మహిళల ఆగ్రహం



రాజాంలో తాగునీటి కోసం రోడ్డుపై అడ్డంగా నిల్చొని ఆందోళన చేస్తున్న మహిళలు

రాజాం రూరల్, జులై 6 (ఆంధ్రజ్యోతి): గుక్కెడు నీటి కోసం మహిళలు రోడ్డెక్కారు.. తీవ్ర ఆవేదనతో మున్సిపల్ యంత్రాంగానికి శాపనార్థాలు పెట్టారు. వారం రోజులుగా నీటి సరఫరా లేకపోతే గొంతు తడిచేదెలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు దిగొచ్చేవరకూ ఆందోళన చేస్తామని హెచ్చరిస్తూ రాజాం-బొబ్బిలి రోడ్డును ఆదివారం నిర్బంధించారు. సుమారు 500 మంది వరకూ రోడ్డుపై బైఠాయించారు. వారి ఆందోళనతో రోడ్డుపై ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ మహిళలు తగ్గలేదు.

రాజాంలో నాలుగైదు రోజులుగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. గడిచిన ఆర్నెళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నా కమిషనర్ తాగునీటి సరఫరాకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదనేది మహిళల ఆవేదన. విద్యుత్ సమస్య ఒకవైపు, ట్రాన్స్‌ఫార్మర్ తరచూ మొరాయించడం మరోవైపు, ఎప్పటికప్పుడు ప్రధాన పైప్‌లైన్లు (మిగతా 8వ పేజీలో..)

అగ్నిమాపక కేంద్రంలో సమస్యల తిష్ట

●సిబ్బంది కొరత, కాలం చెల్లిన వాహనంతో సేవలు

గజపతినగరం, జూలై6 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించిన తక్షణమే స్పందించి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగక కుండా కాపాడే అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. గజపతినగరం నియోజక వర్గానికి సంబంధించి గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లో సేవలు అందించేందుకు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్ర కార్యాలయాన్ని 1988లో ప్రారంభించారు. 37 ఏళ్లు కావస్తున్నప్పటికీ కనీస సదుపాయాలకు దూరంగా ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షానికి కారిపోతోంది. అందులో రికార్డులు తడిసిపోతున్నాయి. రాత్రి సమయాల్లో విష పురుగుల సంచారం కూడా అధికంగా ఉంది. ఎప్పుడు ఎటువంటి ప్రమాదానికి గురికావల్సి వస్తుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. 15 ఏళ్లు దాటిన తర్వాత పాత వాహనం స్థానంలో కొత్త వాహనం మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ కాలం చెల్లిన వాహనాన్నే వినియోగిస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో అదనపు వాహనం మంజూరుకు అప్పటి ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ప్రతిపాదనలు చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దాంతో కాలం చెల్లిన వాహనంతోనే సేవలు అందిస్తున్నారు. ముగ్గురు వాహన డ్రైవర్లు ఉండాల్సి ఉన్నప్పటికీ 1 డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉంది. 9 మంది మెన్‌లు ఉండాల్సి ఉన్నప్పటికీ 5గురు మాత్రమే ఉన్నారు. 2020లో పోస్టుల భర్తీ చేపట్టడం జరిగిందని నాటి నుంచి నేటి వరకు పోస్టుల భర్తీ కాకపోవడంతో అరకొర సిబ్బందితో సేవలు అందజేయాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త భవనం నిర్మాణం చేపట్టడంతో పాటు అలాగే కొత్తవాహనం సమకూర్చాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

గజపతినగరంలో అగ్నిమాపక కేంద్రంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాలం చెల్లిన వాహనంతో విధులు నిర్వహించడం, సిబ్బంది కొరత విషయం ఇప్పటికే తెలియజేశాం.

-ఎం.వి.ఎస్.రవిప్రసాద్, అగ్నిమాపక కేంద్ర అధికారి, గజపతినగరం



గజపతినగరంలో ఫైర్ స్టేషన్ ఇదే..

రామతీర్థంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం

నెల్లిమర్ల, జూలై6 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని రామచంద్రస్వామివారి దేవాలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారి శయన మూర్తులకు విశ్వక్సేన ఆరాధన చేసి శ్రీసీతారామచంద్రస్వామి వారి శయన మూర్తులను చాతుర్మాస దీక్షతో పవళింపు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఏటా ఆషాఢ శుద్ధ ఏడాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలలు శ్రీమహావిష్ణువు యోగ నిద్రలో చాతుర్మాస దీక్షలో ఉంటూ మనందరినీ ఆశీర్వదిస్తూ ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మడ్డువలస నీరు విడుదల

రాజాం, జూలై6 (ఆంధ్రజ్యోతి): గొర్లె శ్రీరాములునాయుడు రిజర్వాయర్ (మడ్డువలస ప్రాజెక్టు) నుంచి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సాగునీరు విడుదల చేస్తారని డీఈ పి.అర్జున్, ఏఈఈలు నితిన్‌కుమార్, అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు, లావేరు మండలాలకు చెందిన 30077 ఎకరాలకు 100 క్యూసెక్కులు నీరును విడుదల చేస్తామని పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

విజయనగరం బాబామెట్ట, జూలై6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం పద్మవిభూషణ్ డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతిని ఆదివారం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. బాల మురళీకృష్ణ ఆలపించిన గీతాలను విశాఖకు చెందిన వీణ విద్వాంసురాలు డాక్టర్ నిర్మల కృష్ణవంశీ వీణలో పలికించి ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి వీణపై వేదుల రమణ, సంస్థ కార్యదర్శి మండపాక రవి మృదంగ వాయిద్య సహకారం అందించారు. సంస్థ అధ్యక్షుడు సర్వేశ్వరావు పాల్గొన్నారు.

40 బియ్యం బస్తాల వితరణ

రేగిడి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలవలసలలో గల రాహుల్ సౌరబ్ అన్నదాన సత్రానికి ఆదివారం ఏపీ రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు 40 బియ్యం బస్తాలను వితరణ చేశారని సత్రం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సత్రంలో కరోనా కాలం మొదలు 2488 రోజులుగా నిరుపేదలకు నిత్యాన్నదానం చేస్తుండటాన్ని గుర్తించి ఐఏఎస్ సౌరబ్ గౌర్, ఏపీ రైస్‌మిల్లు అసోసియేషన్ వితరణకు ముందుకు వచ్చారని సిద్ధార్థ వివరించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

శృంగవరపుకోట రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకులపేటలో ఆదివారం ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఎరుకుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గేదెల సత్తిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రొంగలి చిన్నరాము, సంఘ ఉత్తరాంధ్ర చైర్మన్ గేదెల లక్ష్మణ్, ఎరుకుల సేవా సంఘం మహిళ కార్యదర్శి దాసరి సత్యవతి, మహిళ ఉపాధ్యక్షురాలు గనివాడ సంతోషి కుమారి, గౌరీశంకర్, రమణ, గేదెల అప్పారావు, దాసరి సత్య నారాయణ, దేము డమ్మ, పోతయ్య పాల్గొన్నారు.

బాధితుడికి నిత్యావసరాలు

రాజాం రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉదారతను చాటుకున్నారు. గడచిన వారం రోజులుగా కురిసిన వర్షాలకు నేలమట్టమైన ఇంటి యజమానికి అండగా నిలబడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 4న రాత్రి పట్టణంలోని అమ్మవారి కాలనీలోని రెండో లైన్‌కి చెందిన బత్తిన నూకరాజుకు చెందిన ఇల్లు వర్షానికి నేలమట్టమైంది. దీంతో స్పందించిన టీడీపీ నాయకులు మరిపి జగన్మోహనరావు, గంధి గోపి.. నూకరాజు కుటుంబానికి బియ్యం, నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ, శ్రీను, వెంకటరమణ, యోగేశ్వరావు ఉన్నారు.

రహ్మాన్ కుటుంబానికి ఆర్థికసాయం

జామి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోట్లపల్లి గ్రామానికి చెందిన సచివాలయ విద్యుత్ ఉద్యోగి షేక్ రహ్మాన్ కుటుంబానికి అండగా ఉంటామని ఏపీఈఈయూ 1104 యూనియన్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం రహ్మాన్ కుటుంబ సభ్యులకు వారు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు వర్కింగ్ అధ్యక్షుడు లక్ష్మణ్ గంగునాయుడు, పైడిరాజు, దేముడు, అప్పలనాయుడు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్


సీతారామపురంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, జూలై6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని సీతారామపురం, పిడిశీల గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. వైసీపి పాలనలో అవినీతి, అక్రమాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు. అనంతరం మండలంలోని మల్లునాయుడుపేటకు చెందిన మిత్తిరెడ్డి రమణకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.19 లక్షల చెక్కు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ముక్కువ శ్రీధర్, గుండ్రోతు గోవింద, మిత్తిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి స్థానిక సమస్యలు

జామి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేటలో ఆదివారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కలియదిరిగారు. సీసీ రోడ్డు వేయాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, రామాలయం అభివృద్ధికి సహకరించాలని మంత్రిని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలనపై మంత్రి ఆరా తీశారు. దాంతో స్థానికులు పథకాల అమలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్వామి నాయుడు, పైడిరాజు, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, ముకుంద శ్రీనివాస్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుకు ప్రభుత్వ ప్రతిపాదన

విజయనగరం కలెక్టరేట్, జూలై6(ఆంధ్రజ్యోతి) జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి ప్రభుత్వ ప్రతిపాదనలో ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అయితే పార్కులో ఎటువంటి పరిశ్రమలు వస్తాయన్నది ఇంకా స్పష్టత లేదన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ నిర్వాసిత రైతులకు ఇంకా ఏమైనా పెండింగ్ సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందన్నారు. గత ప్రభుత్వం హయంలో ఇచ్చిన జీవోకు తమపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మంచి స్పందన వస్తోందన్నారు. ఏడాది కాలంలో సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్ళుగా సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఉద్యోగ కల్పన ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనేక కంపెనీలు వస్తున్నాయన్నారు. దాదాపు 4 లక్షల కోట్ల పెట్టుబడి ఉత్తరాంధ్రకు వస్తున్నాయన్నారు. దీంతో 10వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. వైసీపీ హయంలో అనేక జిల్లా సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. వాటిని ఇప్పుడు సరిచేస్తున్నామన్నారు. ఐదేళ్లు బటన్ నొక్కుడు పేరుతో కాలయాపన చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే వైసీపీ నాయకులు తగ ఐదేళ్లు ఏం చేశారో చెప్పాలన్నారు. ఎవరి హయాంలో జిల్లా అభివృద్ధి జరిగిందో.. బహిరంగ చర్చకు వస్తారా అని బొత్స సత్యనారాయణకు మంత్రి సవాల్ విసిరారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి


శునకానికి టీకా వేస్తున్న జేడీ రమణ

విజయనగరం రింగురోడ్డు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్థకశాఖ జేడా డాక్టర్ వై.వి.రమణ అన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం బహుళార్థ పశు వైద్యకళాశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, కోళ్లు ఇతర పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అన్నారు. ముఖ్యంగా పెంపుడు శునకాలు, పిల్లులకు యాంటీ రాబిస్ టీకాలు వేయించాలన్నారు. ఈ సందర్భంగా 584 పెంపుడు శునకాలు, పిల్లులకు రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఇక్కడ వివిధ రకాల జాతులకు చెందిన శునకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉప సంచాలకుడు డాక్టర్ కంటి మహాలక్ష్మి, సహాయ సంచాలకుడు డాక్టర్ సన్యాసినాయుడు, డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ కిశోర్, డాక్టర్ ధర్మారావు, మోహన్, హిమజ సిబ్బంది పాల్గొన్నారు.

●వేపాడ: మండల పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఆదివారం పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ప్రపంచ ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాక్సిన్లు వేశామని తెలిపారు.

●రేగిడి: పెంపుడు కుక్కలకు రేబిస్ నియంత్రణ టీకాలు వేడం తప్పనిసరి అని రేగిడి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రేగిడి వెటర్నరీ అసుపత్రిలో కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు.

మీరు విమర్శించండి.. మేము అభివృద్ధి చేస్తాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మీరు విమర్శలు చేస్తుంటే, మేము మాత్రం అభివద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున.. వైసీపీ నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అన్నారు. ఆదివారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి బొత్స వాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే చాలావరకూ అమలయ్యాయన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్‌లతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో రద్దయిన అన్న క్యాంటీన్లు ఇప్పుడు పని చేస్తున్నాయన్నారు. ఈ విషయాలన్నీ ప్రజల్లోకి వెళ్తే వారికి తెలుస్తాయని నాగార్జున వ్యాఖ్యానించారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం


పాటూరులో ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని పాటూరులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. పథకాల అమలుపై ఆరా తీశారు. దాంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ దాసరి లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జనపురెడ్డి సన్యాసమ్మ, సన్యాసిరావు, అప్పలనాయుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి నాగభూషణం, చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బంగార్రాజు

భోగాపురం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ ఎరుసుపేట, మద్దిపేట, గుడివాడ గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆమె మాట్లాడారు. తాగునీరు, పెన్షన్లు, ఇంటింటి కుళాయి తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆదివారం నందిగాంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగార్రాజు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చరిత్ర చెప్పిన కథలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

విజయనగరం బాబామెట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సాహిత్యానికి కాలం చెల్లదని ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ పూర్వపు కన్వీనర్, రచయిత్రి రాణి శర్మ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జి.వి.శ్రీనివాస్ రచించిన 'చరిత్ర చెప్పిన కథలు' కథా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్వపడే భాష ఉత్తరాంధ్ర భాషన్నారు. ఈ పుస్తకంలో చరిత్రకు ఒక జీవితం ఇచ్చారన్నారు. ముందు తరాలకు వారి వారసత్వాన్ని రచయిత ఇందులో తెలిపారన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి నిర్వాహకుడు చీకటి దివాకర్, రచయిత గంటేడ గౌరీనాయుడు, సాయి పాపినేని, మంజరి, కె.కె.రఘునందన, డి.వెంకటరావు, సహజ సాంస్కృతిక అధ్యక్షుడు ఎన్.కె.బాబు, మయూర హోటల్ ఎండీ యార్లగడ్డ బాబు, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా 'తొలి ఏకాదశి'

విజయనగరం రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వివిధ ఆలయాల్లో ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. నగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం, తోటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాయలం వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, రింగురోడ్డులోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల తో పాటు నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట కోదండ రామాలయంలో 12 గంటల పాటు హరే రామ నామసంకీర్తను చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది భజన కళాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


విజయనగరం: కొత్తపేట కోదండ రామాలయంలో..

●నెల్లిమర్ల: మండలంలోని మొయిద విజయరాంపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు ఆచంట శ్రీనివాసశర్మ చేపట్టారు


ఎస్.కోట రూరల్ వేంకటేశ్వర ఆలయంలో..

●శృంగవరపుకోట రూరల్: మండలంలోని భర్తపురంలో గల కల్యాణ ప్రసన్న వైభోగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జయవిష్ణు పూజలు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తవలస, జూలై6 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ ఉమాదేవి కాలనీకి చెందిన గంగవరపు గౌరి సత్యవరప్రసాద్(38) ఆదివారం మధ్యాహ్నం తమ్మన్నమెరక సమీపంలోని మామిడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త మృతికి ఓ మహిళ కారణమని మృతుడి భార్య ఎర్నెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమాదేవి కాలనీకి చెందిన గంగవరపు గౌరి సత్యవరప్రసాద్, అతడి భార్య ఎర్నెమ్మ.. రాజన్న కాలనీ వద్ద ఇటుకల బట్టీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు తోరణశ్రీ, శ్యామ్‌సుందర్ ఉన్నారు. మృతుడిది గంట్యాడ మండలం లక్కిడాం గ్రామం. అక్కడ నుంచి 20 ఏళ్ల కింద కొత్తవలస మండలానికి వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఓ మహిళతో సత్య వరప్రసాద్ సాన్నిహిత్యం పెంచుకున్నాడు. దీంతో తన సంగతేంటో తేల్చి చెప్పాలని లేకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని ఆమె తరచూ బెదిరించేదని అతడి భార్య పోలీసులకు తెలిపింది. ఆదివారం కూడా సదరు మహిళ సత్య వరప్రసాద్‌కు ఫోన్ చేయడంతో సమీపంలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడని తెలిపింది. వరప్రసాద్‌కు ఉరేసుకున్న విషయాన్ని సదరు మహిళ.. మృతుడి తమ్ముడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. దాంతో వరప్రసాద్ భార్య ఘటనా స్థలానికి వెళ్లింది. అప్పటికే భర్త మృతి చెందినట్టు గుర్తించింది. వరప్రసాద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి చెట్టుకు వేలాడదీశారా? అనే అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరానికి చెందిన చెందిన క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించాయి. మృతుడి భార్య ఎర్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఆసుపత్రికి తరలించారు.

రైలు కింద పడి వృద్ధుడు..

కొత్తవలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తవలస రైల్వే స్టేషన్ సమీపంలో లో ఆదివారం జరిగింది. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా పెందుర్తి మండలం వేపగుంట సమీపం సింహపురికాలనీలో నివాసం ఉంటున్న చొప్ప సీతారామయ్య (78) ఆరోగ్య సమస్యలు కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుడు సీతారామయ్య భార్య నాలుగు సంవత్సరాల కిందట మృతి చెందడంతో తన కుమారుడు వద్ద సింహపురికాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొద్దిరోజులుగా సీతారామయ్య తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో విరక్తి చెందిన సీతారామయ్య ఆదివారం ఉదయం సింహపురి కాలనీ నుంచి కొత్తవలస సిటీ బస్సులో వచ్చి జంక్షన్‌లో దిగాడు. అక్కడ నుంచి కొత్తవలస రైల్వే స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్లి రైల్వేస్టేషన్ నుంచి కొద్ది దూరం రైలు పట్టాలపై నడుచుకుని వెళ్లి ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలు కింద పడిపోవడంతో అక్కడక్కడే మృతి చెందాడు. మృతుడు సమాచారాన్ని జీఆర్‌పీ పోలీసులకు స్థానిక స్టేషన్ మాస్టారు ఇవ్వడంతో జీఆర్పీ పోలీసులుంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు. మృతుడు జేబులో లేఖ ఉంది. తన చావుకు ఎవరూ కారణం కాదని, తాను ఆరోగ్య సమస్యలు కారణంగానే మృతి చెందినట్టు రాసుకున్నాడు. మృతుడి జేబులో ఆధార్ కార్డులో వివరాలను గుర్తించి మృతుడి కుమారుడికి సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పాలభిషేకం


పాలభిషేకం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): తాము ప్రధాని మోదీ పాలనలో ఉన్నామా.. ఆంగ్లేయుల పాలనలో ఉన్నామా అర్థం కావడం లేదని జిందాల్ నిర్వాసితులు అన్నారు. శాంతియుత పోరాటానికి అనుమతులు కావాలని ఎస్పీని కోరినా ఇవ్వడం ఆవేదన వ్యక్తం చేస్తూ మండలంలోని బొడ్డవరలో మహాత్మ గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు ఆదివారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గాంధీ అవలంబించిన అహింస విధానంలో పోరాటం చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగ హక్కులను పోలీసులు ఉల్లంఘించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయపరమైన హక్కులు కాపాడాలని చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు.


బోధనేతర పనులు తగ్గించండి


మాట్లాడుతున్న శ్రీనివాస్

విజయనగరం దాసన్నపేట, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో బోధనేతర పని భారం పెరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. జూలై 10న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం కోసం లీప్ యాప్‌లో విట్నస్ రిజిస్ట్రేషన్‌లో అన్ని స్కూల్స్‌లో జరగాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ విట్నస్ పెట్టుకున్న వ్యక్తి పీటీఎం జరిగే రోజున 30 సెకెండ్ల వీడియో, 4 ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. విద్యార్థులు యూనిఫాంలు, బెల్టులు, షూస్, పుస్తకాలు మాత్రమే కాకుండా మధ్యాహ్న భోజనం పథకానికి బియ్యం మొదలగు వాటిపై ప్రత్యేక కోడ్ నెంబరు ఇచ్చి యాప్స్‌లో అప్‌లోడ్ చేయాలని ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. కొత్త నిర్ణయాలు ఉపాధ్యాయులపై నమ్మకం లేని విధంగా అవమానించేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు షేక్ బుకారిబాబు, బంకురు జోగినాయుడు, సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

●గ్రామస్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రేగిడి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడ సెంటర్- వంగర రూట్‌లో ఉణుకూరు వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఎనిమిదేళ్లగా దాదాపు 300 మీటర్ల రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టలేదని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉణుకూరు వద్ద గుంతలతో రోడ్డు నరకప్రాయంగా ఉందన్నారు. గుంతలు లేని రోడ్డుగా తీర్చిదిద్దుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. ఈనెల 14లోగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే అదేరోజు రాస్తారోకో చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు, కార్యదర్శి మడపాన త్రినాథరావు, వియ్యపు లక్ష్మంనాయుడు, జి.దుర్గారావు పాల్గొన్నారు.

9న టైర్ బంద్ పాటిద్దాం

విజయనగరం దాసన్నపేట, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న టైర్ బంద్ కార్యక్రమాన్ని పాటిద్దామని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో-కన్వీనర్ ఎ.జగన్మోహనరావు కోరారు. ఆదివారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటారు వాహన చట్టం, భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 10 కోట్ల మంది రవాణా కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్స్ రెన్యువల్, రిజిస్ట్రేషన్, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఆర్టీవో కార్యాలయంలో జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు టి.పైడిరాజు, సత్తిబాబు, లక్ష్మణరావు, గంగరాజు, ఐ.ప్రసాద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. విద్యార్థులు చేరక

● మూతపడిన అన్నంరాజుపురం ప్రాథమిక పాఠశాల

సంతకవిటి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండవకురిటి పంచాయతీ పరిధిలోగల అన్నంరాజుపురం ప్రాథమికపాఠశాల నిర్వహణ లేకపోవడంతో విద్యార్థులు చేరకపోవడం వల్ల మూతబడింది. గత సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులు అభ్యసించేవారు.ఈఏడాది ఈముగ్గురు విద్యార్థులు దగ్గర్లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో కొత్తగా విద్యార్థులు కూడా ఇక్కడ చేరలేదు. దీంతో ఇక్కడ పాఠశాలను మూతవేస్తూ గతనెల 24న ఎంఈవో ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ ఉపాధ్యాయుడ్ని చినముకుందపురం ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు.200 మంది వరకూనివసించే ఈగ్రామంలోని పాఠశాల మూతపడడంతో స్థానికులు ఆందోళనవ్యక్తంచేస్తున్నారు. కాగా విద్యార్థులులేకపోవడంతో పాఠశాలను మూసివేశామనిమండల ఎంఈవో బి.శాంతకుమారి తెలిపారు.ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బంకి వెంకటప్పలనాయుడుని చినముకుందపురం ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్ వేసినట్లు తెలిపారు.



అన్నంరాజుపురం ప్రాథమిక పాఠశాల భవనం

రోడ్లు లేక.. తాగు నీరందక

● పెంట జగనన్నకాలనీలో వసతులు కల్పించకపోవడంతో అవస్థలు

బొబ్బిలి రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంట గ్రామం పరిధిలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన జగనన్నకాలనీలో సమస్యలు తిష్ఠవేశాయి. ఇక్కడ 48 ఇళ్ల మంజూరుకాగా 43 ఇళ్లపనులు పూర్తిచేశారు. ఐదు ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం 40 ఇళ్లలో నివాసముంటున్నారు. ప్రధానంగా కాలనీలో లబ్ధిదారులకు కనీస వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు.ఇంటింటా కొళాయిలులేకపోడంతో తాగునీటికి అగచాట్లు తప్పడంలేదు.సీసీరోడ్లు ఏర్పాటుచేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయమవు తున్నాయి.ఇక్కడ విద్యుత్ స్తంభాలకు వేసిన తీగలు వేలాడుతుండడంతో ఈదురుగాలులకు తీగలు రాపిడి వల్ల నిప్పులు రాలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.అయితే విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటిపడిన తర్వాత అమావాస్య తలపిస్తోందని మహిళలు వాపోతున్నారు. చీకటిపడితే బయటకు రావడానికి భయపడుతున్నామని చెబుతున్నారు.కాగా కాలనీలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపించామని హౌసింగ్ ఈఈ సూర్యనారాయణ తెలిపారు.



పెంట జగనన్న కాలనీలో రోడ్డు లేని దృశ్యం

బొబ్బిలిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీలోని ఐదో వార్డులో ఆదివారం ఎమ్మెల్యే బేబీనాయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన ఘనవిజయాలు, అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అపారమైన అనుభవం, పరిపాలనా దక్షతతో రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు దూసుకుపోయేలాతీర్చిదిద్దుతున్నారని తెలిపారు.ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూడాలన్న తన ఆకాంక్షను విజయవంతంగా నెరవేర్చేందుకు సానుకూలమైన అడుగులు పడుతున్నాయన్నారు. అనేక పరిశ్రమలు, కంపెనీలు రాష్ట్రానికి వస్తుండడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు.మూడోవార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త పిట్టా రమేష్ పార్టీ సభ్యత్వం కలిగిఉండగా ఇటీవల ఆయన మృతిచెందడంతో రూ.ఐదు లక్షల బీమా చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు బేబీనాయన అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, ఐదో వార్డు కౌన్సిలరు, వెలడాడ హైమావతి, క్లస్టర్, బూత్, వార్డు ఇన్‌చార్జిలు, కేఎస్‌ఎస్‌లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళల అభివృద్ధికి సహకారం

బొబ్బిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సంపదాయ కళలు, సంగీతం అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే బేబీనాయన హామీఇచ్చారు. నేటితరం బాలబాలికల్లో భారతీయ సంప్రదాయ కళలపై ఆసక్తి పెరుగుతుండడం హర్షనీయమని తెలిపారు.ఆదివారం బొబ్బిలిలోనికళాభారతి ఆడిటోరియంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్ణాటక సంగీతంలో ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో సంగీతాలయ నిర్వాహకులు వంగపండు సునీత,మాటూరి విజయలక్ష్మి, జీఎస్టీఅధికారి దేవులపల్లి సన్యాసిరావు, కళాభారతి అధ్యక్ష, కార్యదర్శులు సిద్దా సత్యనారాయణ, నంబియార్ వేణుగోపాలరావు, చెలికాని చెల్లారావు, నాయకులు పుల్లెల శ్రీనివాసరావు, రౌతు రామ్మూర్తి పాల్గొన్నారు.

ఎరుకులపాకలులో ఏకలవ్య జయంతి

బాడంగి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకుల పాకలు గ్రామంలో ఏకలవ్య జయంతి ఆదివారం నిర్వహించారు. ఆశాడమాసం తొలి ఏకాదశి పురస్కరించుకుని ఏపీవైఎస్‌ఎస్ విజయనగరం జిల్లా అధ్యక్షుడు పాలవలస గౌరి ఆధ్వర్యంలో ఏకలవ్య విగ్రహానికి పూలమాలవేశారు. ఈసందర్భంగా రాయవలస, ఉత్తరావల్లి, కూనాయవలస, బొబ్బిలి, తారాపురం, కొట్టక్కి గ్రామాల్లోని ఎరుకుల కులస్థులు లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి తదితరుల ఆధ్వర్యంలో ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేశారు.

210 కుక్కలకు ఏఆర్‌వీ టీకాలు

బొబ్బిలి రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి వెటర్నరీ డిస్పెన్సరీలో ఆదివారం అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, పాడి పశువులు, పెంపుడుజంతువుల గురించి యజమానులకు పశువైద్యాధికారి సుధాకర్ అవగాహన కల్పించారు.మండలంలోని 210 పెంపుడు కుక్కలకు ఆ పశుసంవర్ధకసహాయకులతో ఉచితంగా యాంటీరేబిస్ వ్యాక్సినేషన్ చేయించినట్లు తెలిపారు.పెంటవెటర్నరీ డిస్పెన్సరీలో డాక్టర్ హిరణ్య ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఏఆర్వీ కార్యక్రమం నిర్వహించి పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పించారు.

అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు

బొబ్బిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పల పాటి రాజేశ్వర్మ తెలిపారు. ఆదివారం బొబ్బిలిలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గస్థాయి బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇటీవల బీజేపీలో చేరిన ఆర్‌ఎస్‌ఎస్ నేత పెంట స్వామినాయుడు ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నియోజకవర్గ అధ్యక్షురాలు నీలిమాచౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వామినాయుడు, నియోజకవర్గ కన్వీనరు మరిశర్ల రామారావునాయుడు , చెలికాని కేశవ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వర్మ

జగన్నాథునికి ప్రత్యేక పూజలు

బొబ్బిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి కంచరవీధిలో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బలభద్ర, సుబద్రాదేవి సమేత జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగాఆదివారం రథయాత్రను నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి తొలిఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో రథయాత్ర చేట్టారు.

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు

బొబ్బిలి తారకరామాకాలనీలోగల సీతా కోదండరామస్వామి ఆలయంలో తొలిఏకాదశి పురస్కరించుకొని ఆదివారం అర్చకులు గొల్లపూడి వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయం, కంచరవీధి కళ్యాణ వేంకటేశ్వరస్వామి, సింగారపువీధి వైభవ వేంకటేశ్వరస్వామి, స్వామివారివీధి, పాతబొబ్బిలి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

చినుకుపడితే బురదమయం

● గిరిజనులకు తప్పని అగచాట్లు ● అభివృద్ధికి నోచుకోని ఆంద్ర-కుంబినవలస రోడ్డు



బురదలో కూరుకుపోయిన ఆటో

మెంటాడ, జూలై6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంబినవలస గ్రామ గిరిజనులకు చినుకుపడితే అగచాట్లు తప్పడంలేదు. ఆంద్ర, కుంబినవలస గ్రామాల మధ్య ఉన్న రహదారి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడంలేదు. సుమారు ఐదు కిలోమీటర్ల పొడవుఉండే ఈ రోడ్డే మూడు,నాలుగు గ్రామాల ప్రజలకు ఆధారం.ఏటా వర్షాకాలం వస్తే ఆయా గ్రామస్థులు నిత్యావసరాలుతీసుకువెళ్లడానికి కూడా ఇబ్బందిపడుతున్నారు. చినుకుపడితే రోడ్డు దమ్ముమడిలా మారిపోతుండడంతో ఈ మార్గంలో ప్రయాణమంటే హడలిపోతున్నారు. మోకాలిలోతు బురదలో కాళ్లు కూరుకుపోతున్నాయి. ద్విచక్రవాహనాలు,ఆటోలు కూడా బురదలో కూరుకుపోతుండడంతోగ్రామస్థులు అష్టకష్టాలుపడుతున్నారు. గర్భిణులు, అనారోగ్యంతో బాధపడేవారిని ఆస్పత్రులకు తరలించాల్సిన అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్థులు అవస్థలువర్ణనాతీతం. వైసీపీ హయాంలో ఈ రోడ్డు అభి వృద్ధికి చర్యలు తీసుకోవడంలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వహయాంలో రోడ్డు మరమ్మతు పేరుతో పంచాయతీ నిధులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలొస్తున్నాయి. అధికారులు, స్పందించి ఆంధ్ర-కుంబినవలస రోడ్డును అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కాలువలపై..చెరువు గట్లు పక్కన

● అంతిమ సంస్కారాలకు అగచాట్లు

● శ్మశాన వాటికలు ఏర్పాటుకు నోచుకోని వైనం

● ఇదీ బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో పరిస్థితి

బొబ్బిలి రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లె సీతారాంపురం, అలజంగి, పెంట, నారాయణప్పవలస, సీహెచ్ బొడ్డవలస తదితర గ్రామాల్లో శ్మశానవాటికలు లేవు. దీంతో కాలువలపై, చెరువు గట్ల పక్కన, ఖాళీ స్థలాల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సివస్తోంది. దశాబ్దాల తరబడి శ్మశానవాటికలు లేకపోవడంతో మృతదేహాల అంత్యక్రియలు నిర్వహణ సమయంలో పలుసార్లు స్థానికుల మధ్య తగాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఉపాధిహామీ పథకం నిధులతో శ్మశనవాటికలను అభివృద్ధి చేస్తామని అధికారులు ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో ఆ పనులు ముందుకుసాగడంలేదు. పలు గ్రామాల్లో శ్మశానవాటికలు నిర్వహించే ప్రాంతాల్లో కనీస వసతులు కరువయ్యాయి. ప్రధానంగా నీటి వసతి లేదు. వర్షం కురిస్తే దహన సంస్కారాలకోసం వచ్చే వారంతా షెడ్లు ఏర్పాటుకు నోచుకోలేదు. పట్టణ ప్రాంతాల్లో అధునాతన సౌకర్యాలతో విద్యుత్ దహనవాటికలు ఏర్పాటు చేస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో శ్మశనవాటికల్లో కనీస సౌకర్యాల కల్పనకు దృష్టిసారించడంలేదని పలువురు వాపోతున్నారు. కాగా శ్మశాన వాటికల ఏర్పాటుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు.



ఎటువంటి వసతులులేని గొర్లెసీతారాంపురంలో శ్మశానవాటిక

రీ సర్వేతో ఇన్ని కష్టాలా?

(ఐదో పేజీ తరువాయి)

అధికారులపై అప్పటి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెచ్చింది. దీంతో వారు తప్పులు తడకలతో సర్వే చేసి మమ అనిపించారు. రాష్ట్రంలో ఏగ్రామంలో 1-బీ కాపీలను చూసినా తమకు భూమి ఎలా దఖలు పడిందనే కాలమ్‌లో అనువంశికం అనే ఉంటుంది తప్ప మరో కారణంలేదు.వ్యవసాయ భూములను కొనుగోలుచేసుకున్నవారికి ఆ కాలమ్‌లో గతంలో క్రయం అని ఉండేది. ఇప్పుడు క్రయం అనే పదమే లేదు. దీనివల్ల కూడా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితిలో రీసర్వేను రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని రైతులు కూటమి ప్రభుత్వాన్ని కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం మాత్రం ఎక్కడ రీసర్వే ఆగిపోయిందో మళ్లీ అక్కడ నుంచి మొదలు పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దడం కోసం మొదట్లో ప్రత్యేక రెవెన్యూ సదస్సుల పేరుతో హడావుడి చేశారు తప్ప పూర్తిస్థాయిలో సరిదిద్దలేదు. భూములను కొనుగోలు చేసుకున్నవారు 1-బీ కాపీలో అనువంశికానికి బదులు క్రయం అని మార్పు చేయాలంటే సర్వే నెంబరుకు రూ.50 చొప్పున చలానా కట్టాలని రెవెన్యూశాఖ చెబుతోంది. ఇక ఎల్‌పీఎంలను విడదీసుకోవాలంటే జూన్ 30 వరకు రూ.50 చలానా కడితే సరిపోయేది. జూలై 1వ తేదీ నుంచి జాయింట్ ఎల్‌పీఎంలను విడదీసుకోవాలంటే ఒక్కో నెంబరుకు రూ.550 చెల్లించాలి. ఆ ప్రభుత్వం తప్పు చేస్తే తమకా శిక్షా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం నాటి తప్పులను ఎలాంటి ఫీజు తీసుకోకుండా సరిదిద్దాలని కోరుతున్నారు.

నిధులు సరే బిల్లులేవి?

(ఐదో పేజీ తరువాయి)

పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అభివృద్ధి పనుల కోసం ఒకేరోజు గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేశాయి. ఆపై జిల్లా వ్యాప్తంగా 4347 పనులకు రూ.438 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకూ 2808 పనులు పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పూర్తి చేసిన పనులకు గత ఏడాది డిసెంబరు 13 వరకూ రూ.84 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత పూర్తి చేసిన పనులకు చెల్లించడం లేదు. ఇప్పటి వరకూ రూ.109 కోట్ల బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. బిల్లులు సీఎఫ్‌ఎంఎస్‌లో కూడా అప్‌లోడ్ చేశారు. దాదాపు 8 నెలల నుంచి బిల్లులు మంజూరు కాక మిగిలిన పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గ్రామాల్లో పనులు మధ్యలో ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళనలు చేశారు. ఈ ప్రభుత్వంలోనూ సమస్య పునరావృతం కావడంతో మథనపడుతున్నారు. పల్లె పండుగలో పనులు చేపట్టిన వారు చాలా వరకు టీడీపీ, జనసేన కార్యకర్తలే. చేసిన పనులకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోయినప్పటికీ బయటకు చెప్పుకోలేక మౌనంగా ఉంటున్నారు. పశువుల షెడ్‌లకు గ్రామాల్లో రైతులు ముందుగా పెట్టుబడి పెట్టి నిర్మించారు. ప్రతి రైతు లక్ష నుంచి లక్షా 80 వేల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టారు. వీరికి డిసెంబరు నెల నుంచి బిల్లులు మంజూరు కావడం లేదు.

● జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో జరిగిన సాధారణ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.42 కోట్లకు ఎఫ్‌టీవోలు అప్‌లోడ్ చేశారు. పశువుల షెడ్లకు రూ.11 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇప్పటివరకూ 20 శాతం నిధులు జమ అయినట్లు సమాచారం. సాంకేతిక సమస్యవల్ల బిల్లులు జమ కావడంలేదని అధికారులు చెబుతున్నారు. పక్క జిల్లాలో నిధులు జమ అవుతున్నా మన జిల్లాలో ఎందుకు కాలేదని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

వారంతా బడి బయటే

(ఐదో పేజీ తరువాయి)

ఈడున్న విద్యార్థులు అయితే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదిలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఇంటర్‌లో చేర్పిస్తారు.

తగ్గిన డ్రాపౌట్స్..

గత ఏడాదితో పోల్చుకుంటే డ్రాపౌట్స్ తగ్గడం విశేషం. గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 6,259 మంది ఉన్నారు. ఈ ఏడాది ఆ సంఖ్య 2,637కు తగ్గింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. విలీనమైన పాఠశాలలను వెనక్కి తెప్పించారు. ఆదర్శ పాఠశాలలను ఏర్పాటుచేశారు. సుదూర ప్రాంతంలో పాఠశాలల్లో చదువుకుంటున్న వారికి రవాణా చార్జీలు కింద ఏడాదికి రూ.6 వేలు అందిస్తున్నారు. సన్నబియ్యంతో మంచి మెనూతో కూడిన మధ్యాహ్న భోజన పథకం అమలుచేస్తున్నారు. తల్లికి వందనం కింద విద్యార్థి తల్లిఖాతాలో రూ.13 వేలు ఎంతమంది ఉంటే అంతమందికి అందించారు. పాఠశాల నిర్వహణకు రూ.2 వేలు చొప్పున జమ చేశారు. దీంతో పాఠశాలల నిర్వహణకు సామగ్రి అంతా ఇటీవల విడుదలైంది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా పెరుగుతోందని ఉపాధ్యాయవర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు మాత్రం పాఠశాల విద్యాను వెంటాడుతున్నాయి.

వైసీపీ హయాంలో ప్రయోగాలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో పాఠశాల విద్యాశాఖపై ఎన్నోరకాల ప్రయోగాలు జరిగాయి. పాఠశాలల ఎత్తివేత, సమీప పాఠశాలలో సర్దుబాటు, ఉపాధ్యాయులను సమీప ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు వంటి ప్రక్రియతో పాఠశాల విద్యాశాఖ అస్తవ్యస్తంగా మారింది. ఆ ప్రభావం విద్యార్థుల చదువుపై పడింది. చిన్న తరగతుల వారు కిలోమీటర్ల మేర నడిచి పాఠశాలలకు చేరుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఎదురైంది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం పాఠశాలలను కుదించింది. పరిసర పాఠశాలల్లో విలీనం చేసింది. అటు ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు చేసింది. ఆన్‌లైన్ బోధనకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి మాతృభాష, ప్రాంతీయ భాషలను నీరుగార్చినట్టు విమర్శలొచ్చాయి. బైజూస్ లాంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని ఉపాధ్యాయుల పాత్రను నిర్వీర్యం చేసింది. ఇవన్నీ పాఠశాల విద్యాబోధనపై ప్రభావం చూపాయి. డ్రాపౌట్స్ పెరిగిపోయారు. ఆ తప్పిదాలను సరిచేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది.

రోడ్డెక్కిన మహిళలు

(ఐదో పేజీ తరువాయి)

బీటలు వారడం ఇంకోవైపు.. ఇలా రోజుకో కారణంతో రాజాం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోతోంది. ఫలితంగా కుళాయి నీటిపై ఆధారపడే బడుగు, బలహీనవర్గాల పరిస్థితి దయనీయంగా మారింది. విసిగి వేసారిపోయిన వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఆదివారం ఉదయం అంతా కలిసి మూకుమ్మడిగా రోడ్డెక్కారు. తమ ఆవేదనను వెళ్లగక్కారు. ఫలితంగా సుమారు నాలుగు గంటల పాటు రాజాం-బొబ్బిలి రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రెండువైపులా సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే రేగిడి వద్ద పంపింగ్‌లో సమస్య పరిష్కారం కావడంతో వారంతా శాంతించి ఇంటిబాట పట్టారు. కాగా గుక్కెడు నీటి కోసం మహిళలు నాలుగు గంటలపాటు రోడ్డెక్కినా మున్సిపల్ కమిషనర్ గాని, సిబ్బంది గాని ఘటనాస్థలం వద్ద కనిపించకపోవడం కొసమెరుపు.

బుడా లేఅవుట్ ఎప్పటికో!

(ఐదో పేజీ తరువాయి)

కోర్టుకు అప్పీలుకు వెళుతున్నట్లు సమాచారం. మొత్తానికి ప్రభుత్వ ఉద్యోగులు, మధ్యతరగతి వర్గీయుల సొంత ఇంటి కల నెరవేరేందుకు ఇంకెన్నాళ్లు పడుతుందో ఇదమిద్ధంగా తెలియడం లేదు.

● బుడా పరిధిలో ఆదాయవనరులను పెంచుకునేందుకు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రైవేట్ లేఅవుట్ల అభివృద్ధి, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించారు. వాటికి కూడా ఇంతవరకు ఎటువంటి అడుగుపడడంలేదు. దీంతో బుడా వ్యాపార కార్యకలాపాలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యేదిఇంకెప్పుడా?అనిస్థానికులు ప్రశ్నిస్తున్నారు. సాలూరులో బుడా పరిధిలో వేసిన ఎంఐజీ లేఅవుట్‌కు మంచి స్పందన రావడంతో అక్కడ లబ్ధిదారులకు లాటరీ ద్వారా స్థలాలు కేటాయించారు. పార్వతీ పురంలో అడ్డాపుశీల దగ్గర గుర్తించిన బుడా ఎంఐజీ స్థలానికి ఫీజిబిలిటీ లేని కారణంగా ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. బొబ్బిలిలో స్థల సేకరణే జరగడం లేదు. ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసి ఎంఐజీ లేఅవుట్లు వేసే అవకాశం కూడా బుడాకు ఉంది. ఆ వైపుగా ఆలోచన చేయడం లేదు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రామభద్రపురం, జూలై6(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటశిర్లాం గ్రామానికి చెందిన బొప్పడాల ప్రభాకర్ గతనెల 25 నుంచి అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ప్రభాకర్‌కు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోతుంటాడని భార్య బొప్పడాలకుమారి తెలియజేశారని పేర్కొన్నారు.ఈక్రమంలో ఈనెల 25న ఇంటి నుంచి వెళ్లిపోగా, బంధువులు వెతకగా ఆచూకీ లభించలేదని తెలిపారు.భార్య ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తెర్లాం రోడ్డు మరమ్మతులకు నిధుల మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొబ్బిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి- తెర్లాం (కి.మీ. 3/0 నుంచి 3/6 వరకు, 6/0 నుంచి 10/0వరకు) రోడ్డులో గొల్లపల్లి నుంచి అలజంగి, కారాడ వరకు బిట్స్ రూపంలో మరమ్మతుల కోసం రూ.450 లక్షలు మంజూరైనటు ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బీకేఏ రాజు తెలిపారు.ఈనెల రెండో తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో రోడ్డుబాగుపడేదెప్పుడో? శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఆయన స్పందించారు.టెండరుప్రక్రియ పూర్తయినవెంటనే పనులు చేపడతామని తెలిపారు. మిగిలిన కి.మీ. 0/0 నుంచి 3/0, 6/0 నుంచి 10/0 వరకు 26/833 వరకు రూ. 850 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా సాయికుమార్

రామభద్రపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): బూసాయవలస గ్రామానికి చెందిన గంట సాయికుమార్‌ను టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన నియమించారు. ఆయన గతకొన్నేళ్లుగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు. సాయికుమార్ నియామకంపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కాపు రామారావు, రామభద్రపురం ఎంపీటీసీలు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, రొంపల్లి ఎంపీటీసీసభ్యుడు భవిరెడ్డి శంకరరా వు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.